విద్యార్థులకు 'జగనన్న విద్యా కానుక

- నేడు మోగనున్న బడి గంట
- విద్యార్థుల కు నేటి నుంచి కానుకల పంపిణీ
- ఇప్పటికే బడులకు చేరిన కిట్లు

మంత్రాలయం: పాఠశాలల ప్రారంభమైన తొలి రోజే జగనన్న విద్యా కానుక సంబరం మొదలు కానుంది. బడి గంట మోగే వేళ కానుకల పంపిణీ ప్రారంభం కానుండటంతో తల్లిదండ్రులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– నియోజకవర్గంలో మొత్తం 197 పాఠశాలలుండగా 54,385 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి జగనన్న విద్యా కానుక కిట్లు ఆయా పాఠశాలలకు చేరాయి. ఈ ఏడాది ముందుగానే విద్యార్థులకు కానుకలు అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన పుస్తకాలు, షూ, బ్యాగులు, యూనిఫాం తదితరాలను విడతల వారీగా జిల్లాలకు చేర్చి అక్కడి నుంచి మండల కేంద్రాల్లోని విద్యాశాఖ అధికారులకు పంపారు. వారు వాటిని కిట్లుగా మార్చి ప్రభుత్వ పాఠశాలలకు అందజేశారు. మంత్రాలయం నియోజవకర్గంలో విద్యార్థులకు అవసరమైన కిట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే 3,56,628 పాఠ్యపుస్తకాలు, బూట్లు 50,849, బ్యాగులు 50 వేలు వచ్చాయి. డిక్షనరీ, బెల్టులు,సాక్సులు త్వరలోనే అందజేస్తామని అధికారులు చెబుతున్నారు.


ప్రారంభానికి సిద్ధమైన కోసిగి పాఠశాల

మండలాల వారీగా విద్యాకానుక వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	పుస్తకాలు	బూట్లు	యూనిఫాం
మంత్రాలయం	47	14,400	62 వేలు	15 వేలు	14,800
కోసిగి	48	14,565	1.27 లక్షలు	15,468	14,669
పెద్దకడబూరు	43	10,711	75,628	10,711	10,711
కౌతాళం	59	14,669	92 వేలు	14,663	14,669
మొత్తం	197	54385	3,56,628	55,842	50,849

తొలిరోజే విద్యాకానుక పంపిణీ చేస్తాం



విద్యాకానుక పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. పాఠశాల ప్రారంభం రోజే విద్యార్థులకు కానుక పంపిణీ చేసేలా ఇప్పటికే అన్ని పాఠశాలలకు కానుక సామగ్రి అందజేసింది. ఎక్కడైనా ఏమైనా సమస్యలు ఉంటే హెచ్ఎంలు మా దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– మొహీనుద్దీన్, ఎంఈఓ, మంత్రాలయం


పాఠశాలలకు చేరిన విద్యాకానుక కిట్లు

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

- 12 నుంచి 17వ తేదీ వరకు ఒంటి పూట బడులు
- ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు తరగతులు

ఆదోని సెంట్రల్ : నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. మండలంలో ప్రాథమిక పాఠశాలలు 89, ప్రాథమికోన్నత పాఠశాలలు 22, ఉన్నత పాఠశాలలు 19 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 39,159 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇప్పటికే పాఠశాలల్లో గదులను శుభ్రపరచడం వంటి పనులను పూర్తి చేశారు. పాఠశాలలు ప్రారంభం రోజే జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేయనుండటంతో ఇప్పటికే కానుకలను హెచ్ఎంలు సిద్ధం చేశారు.పాఠ్యపుస్తకాలతో పాటు బ్యాగులు, షూ, డిక్షనరీలు,నోట్‌పుస్తకాలు,యూనిఫాం వంటివి వచ్చాయి. వాటిని స్థానిక నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాల నుంచి మండంలోని ఆయా పాఠశాలలకు తరలించారు. అయితే ఎండల తీవ్రత కొనసాగుతుండటంతో 12 నుంచి 17వ తేదీ వరకు ఒంటి పూట బడులను నిర్వహించాలని ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు తరగతులను నిర్వహించాలని ఆదేశించింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉదయం 8.30 గంటలకు రాగి జావ, మధ్యాహ్నం 11.30 నుంచి 12.00 గంటల వరకు భోజనం అందించనున్నారు.


అర్ధగేరి బసవనగౌడు పాఠశాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

విద్యాకానుక కిట్లు అందిస్తాం



ఏ విద్యార్థికి పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం ,షూ వంటివి భారం కాకూడదని ప్రభుత్వం జగనన్న విద్యాకానుక కిట్లను అందిస్తోంది. పాఠశాల ప్రారంభం రోజే విద్యార్థులందరికీ విద్యాకానుక కిట్లను అందించాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించింది. ఈ మేరకు అందుకు సంబంధించిన కానుక కిట్లను బడులకు చేర్చాం. తొలి రోజే ఉపాధ్యాయులు విద్యార్థులకు కానుకలు అందజేస్తారు.

– బి.శివరాములు, ఎంఈఓ

తప్పిన ప్రమాదం

ఆదోని టౌన్ : పట్టణంలోని ప్రధాన రోడ్డులోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పై అంతస్తు గోడ కూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రతి రోజూ కోర్టు, మున్సిపల్ కార్యాలయానికి సులభ్ కాంప్లెక్స్‌కు వెళ్లేందుకు ఆ ప్రదేశం రద్దీగా ఉండేది. ఆదివారం కావడంతో జనం లేకపోవడంతో పైకప్పు కూలిన సమయంలో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. కాగా.. కొన్నేళ్లుగా షాపింగ్ కాంప్లెక్స్ శిథిలావస్థకు చేరుకుంది. మరమ్మతులు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వ్యాపారులు చెబుతున్నారు.


మున్సిపల్ కాంప్లెక్స్ పై భాగం నుంచి పెచ్చులు ఊడిన పడిన దృశ్యం


మున్సిపల్ కాంప్లెక్స్ పై భాగం శిథిలావస్థకు చేరిన దృశ్యం

విత్తన డీలర్లపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని విత్తనాలను అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకొనే డీలర్లపై చర్యలు తీసుకోవడంతో పాటు ఆయా విత్తన దుకాణాలను సీజ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపణ్ణగౌడ్, పట్టణ కార్యదర్శి రంగన్న డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి అధిక ధరల రక్కసి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ మొదలుకావడంతో పట్టణంలో ఎరువులు, విత్తనాల విక్రయాలు జోరందుకున్నాయన్నారు. వాటిని కొనుగోలు చేసేందుకు నియోజకవర్గంలోని మండలాలతో పాటు మంత్రాలయం, రాయచూరు, తెలంగాణ రాష్ట్రంలోని తుంగభద్ర నదీతీరా ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో రైతులు పట్టణానికి వస్తున్నారని చెప్పారు. అమాయక రైతులను మోసగిస్తూ వ్యాపారులు అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులను విక్రయించి సొమ్ము చేసుకొంటున్నారని ఆరోపించారు. ఎంఆర్పీ ధరలపై రూ.500 నుంచి రూ.900 వరకు అధిక ధరకు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఆయా దుకాణాల వ్యాపారులపై చర్యలు తీసుకొని షాపులను సీజ్ చేయాలని కోరారు. సీపీఐ నాయకులు బాలరాజు, సమీవుల్లా, చిన్నన్న, సత్యన్న, కేసీ జబ్బార్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో అధిక ధరల రక్కసి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు


జ్ఞాపక'శక్తి' పోతోంది

- పెరుగుతున్న మతిమరుపు జబ్బు
- ఐదేళ్లలో ఐదు శాతం పెరిగిన బాధితులు
- జిల్లాలో 10 శాతం దాకా బాధితులు
- మానసిక ఒత్తిడి, ఆందోళనలే కారణం
- స్మార్ట్ ఫోన్ల అతివాడకం కూడా కారణం
- చిన్నచిన్న విషయాలు మర్చిపోతున్న వైనం

• కర్నూలు నగరంలోని పాతబస్టాండ్‌కు చెందిన చంద్రశేఖర్ ఓ ప్రైవేటు సంస్థలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. ప్రతిరోజూ తాను ఎవరిని కలవాలి, ఎవరికి ఫోన్ చేయాలి వంటి విషయాలన్నీ బాగా గుర్తుండేవి. ఒకప్పుడు ఫలానా వ్యక్తి ఫోన్ నంబర్ ఎంత అని అడిగితే సెల్‌ఫోన్ చూడకుండానే ఠకీమని చెప్పేవాడు. ఇలా దాదాపు ఐదారు వందలకు పైగా ఫోన్ నంబర్లు అతని మెదడులో నిక్షిప్తమై ఉండేవి. స్మార్ట్‌ఫోన్‌పై ఎక్కువగా ఆధారపడ్డాక ఇప్పుడు ఇంటి ఫోన్ నంబర్ చెప్పాలన్నా ఫోన్ చూడక తప్పడం లేదు.

కర్నూలు(హాస్పిటల్): సాధారణంగా వృద్ధాప్యంలో మతిమరుపు వస్తుంది. దానిని వైద్యపరిభాషలో అల్జీమర్స్ అంటారు. 60 నుంచి ప్రతి పదేళ్లకు ఒక స్టేజి మారుతూ తీవ్రత పెరుగుతుంది. ఇది వృద్ధుల్లో 10 నుంచి 20 శాతం మందికి ఉండే సమస్య. కానీ ఇటీవల యువతలోనూ మతిమరుపు సమస్య వస్తోంది. చదువుతో పాటు ఉద్యోగంలో తీవ్ర మానసిక ఒత్తిడి, మానసిక ఆందోళన పనిపై ఏకాగ్రత్తను దెబ్బతీస్తోంది. దీనికితోడు స్మార్ట్‌ఫోన్ వచ్చాక మెదడులో ఉన్న జ్ఞాపక'శక్తి' కోల్పోతోంది. ఈ క్రమంలో పూర్వంలాగా మెదడుకు మళ్లీ వ్యాయామం చేయించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మతిమరుపు సమస్యతో 10 శాతం వరకు సాధారణ ప్రజలు బాధపడుతున్నారు. ఇందులో వృద్ధుల శాతం 15 నుంచి 20 శాతం వరకు ఉంటోంది. కర్నూలు నగరంలోని మానసిక వైద్యులు, న్యూరాలజిస్టుల వద్దకు వివిధ రకాల సమస్యలతో వస్తున్న వారిలో ప్రధానంగా జ్ఞాపకశక్తి సమస్య కూడా ఉంటోంది. ఆయా వ్యాధి లక్షణాలతో పాటు తమకు ఈ మధ్య సరిగ్గా గుర్తుండటం లేదని వైద్యులకు రోగులు చెబుతున్నారు.



కోవిడ్–19 పరిస్థితుల్లో తీసుకున్న మందులు, వైరస్ కారకాల కారణంగా జ్ఞాపకశక్తి మరింత తగ్గిపోయిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

సొంతంగా ఆలోచించడం మానేశారు

ఏదైనా పదానికి అర్థం తెలియాలంటే తెలిసిన వారిని, పెద్దలనో అడిగే వారు. లేదా డిక్షనరీ, తెలుగు నిఘంటువులలో వెతికేవారు. కానీ ఇప్పుడు ఏ చిన్న పదం తెలియకపోయినా వెంటనే సెల్‌ఫోన్‌లోని గూగుల్‌లో వెతికేస్తున్నారు. అలాగే ఏదైనా లెక్క చెబితే పెన్ను పేపర్ తీసుకుని సాధన చేసి సమస్య పరిష్కరించేవారు. కానీ ఇప్పుడు వెంటనే కాలుక్యులేటర్‌ను ఉపయోగిస్తున్నారు. ఏ పదానికి అర్థం కావాలన్నా, ఏ చిన్న సమస్యకు పరిష్కారం కావాలన్నా, ఏదైనా ఒక విషయం గురించి తెలుసుకోవాలన్నా వెంటనే గూగుల్‌లో వెతికితే క్షణాల్లో సమాధానం లభిస్తోంది. ఇక దీనివల్ల సమయం ఆదా అవుతున్నా ఆలోచించే గుణం లోపిస్తోంది. కాగా ఇటీవల చాట్–జీపీటీ వచ్చిన తర్వాత సమాధానాలే అందులో వస్తున్నాయి. ఇది మనిషి మెదడును పూర్తిగా తినేస్తుందని నిపుణులు ఆందోళన చెందుతున్నారు.

మతిమరుపునకు కారణాలు

పది మంది కలిసి మనసు విప్పి మాట్లాడుకోకపోవడం, గుంబనంగా ఉండటం, వ్యక్తులకు దూరంగా ఉండటం, ప్రతి విషయానికీ సోషల్ మీడియాపై ఆధారపడటం, ఏ పని చేయాలన్నా ఆందోళన చెందడం, హడావుడి పెరగడంతో తీవ్ర ఒత్తిడికి గురికావడం వంటి కారణాలతో మతిమరుపు బాధితుల సంఖ్య పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. దీనికితోడు పనిఒత్తిడి, కుటుంబ సమస్యలు, ఆర్థికాంశాలు కూడా మతిమరుపునకు కారణమవుతున్నాయి.

అనుబంధాలు దూరం

స్మార్ట్‌ఫోన్ వినియోగంలోకి వచ్చాక సామాజిక బంధాలూ దూరమవుతున్నాయి. పేరుకు వివాహాది శుభకార్యాల్లో అందరూ కలుస్తున్నా మాట వరసకు పలకరించుకుని ఆ తర్వాత ఎవరి స్మార్ట్‌ఫోన్‌లో వారు బిజీగా ఉండి పోతున్నారు. ఎదురుగా మనిషి మాట్లాడుతున్నా వింటున్నట్లే నటిస్తూ స్మార్ట్‌ఫోన్‌లో బిజీగా గడుపుతుండటం మనం నిత్యం గమనిస్తుంటాము. అలాగే ఎవరి ఇంటికి వెళ్లినా, ఎవ్వరైనా ఇంటికి వచ్చినా ఇదే పరిస్థితి నెలకొంది. దీనివల్ల మనుషుల మధ్య అనుబంధాలు దూరమవుతున్నాయి. ఒక బస్సుల్లో పేపర్ చదివే ప్రయాణికులు లేరు. 98 శాతం మంది స్మార్ట్‌ఫోన్ చూస్తూ పక్కనున్న వారిని కూడా పలకరించని పరిస్థితి.

మత్తుపదార్థాలతో పెనుముప్పు

మత్తుపదార్థాలను వాడటం వల్ల కూడా మెదడు మొద్దుబారి పోయి మతిమరుపునకు కారణం అవుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కల్లుతాగే వారిలో మతిమరుపు సమస్య అధికమవుతోందని వైద్యులు గుర్తించారు. ఇందులో మత్తు కోసం క్లోరల్ హైడ్రేట్, ఆల్ప్రాజోలమ్ వంటి కెమికల్స్ కలుపుతున్నారు. దీన్ని తాగిన వారు త్వరగా మత్తుకు బానిస అవుతున్నారు. దీంతో పాటు చీప్ లిక్కర్, పరిమితికి మించి ఆల్కహాలు తాగేవారు, చైన్‌స్మోకర్లలోనూ మతిమరుపు సమస్య ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు.

మతిమరుపునకు ఇలా చెక్‌పెట్టొచ్చు

- పుస్తకపఠనం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది.
- నిత్యం కెరీర్ గోల్స్‌ను లక్ష్యంగా ఉంచుకోవాలి. ఇందుకోసం రోజు, వారం, నెలవారీగా ప్రణాళికలు రూపొందించుకోవాలి.
- శారీరక వ్యాయామం, మంచి ఆలోచనలు, మంచి ఆహారపు అలవాట్లు, ఇతరులతో మమేకం కావడం , కబుర్లు చెప్పుకోవడం చేయాలి.
- మెదడుకు పనిచెప్పే చదరంగం, ఫజిల్స్ పూరించడం, సుడోకో, పదవిన్యాసం చేయాలి.
- యోగా, ధ్యానం చేయాలి.
- సంగీతం, నృత్యం, చిత్రలేఖనం అభిరుచిగా ఎంచుకోవాలి.

కోవిడ్ తర్వాత పెరిగిన మతిమరుపు



పోస్టు కోవిడ్ తర్వాత మతిమరుపు బాధితుల సంఖ్య బాగా పెరిగింది. గతంతో పోలిస్తే 5 శాతం మంది బాధితులు పెరిగారు. వైరస్ కారణంగా మెదడులో అనేక మార్పులు జరగడం వల్ల ఈ పరిస్థితి సంభవించింది. ప్రస్తుతం 40 ఏళ్లలోపు వారిలోనూ మతిమరుపు సమస్యలతో బాధపడుతున్నారు. దీంతో పాటు బీపీ, షుగర్ దీర్ఘకాలంగా అదుపులో లేకపోయినా నరాల్లో మార్పులు జరిగి మతిమరుపునకు కారణం అవుతుంది. కాబట్టి ఎప్పుడూ బీపీ, షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవాలి.

– డాక్టర్ కె. నాగిరెడ్డి, మానసిక వైద్యనిపుణులు, కర్నూలు

పెద్దల్లో మతిమరుపు పట్ల జాగ్రత్త



అల్జీమర్స్ వయస్సు మీదపడే కొద్దీ సమస్య ఎక్కువవుతుంది. దీనివల్ల వృద్ధాప్యంలో ఇబ్బందులు పడుతుంటారు. దీనికి మధుమేహం, రక్తపోటు, పక్షవాతం, పొగ, మత్తుపానియాలు తాగడం, తలకు గాయాలు కావడం, జన్యుపరమైన మార్పులు, విటమిన్–బి12, విటమిన్–డి లోపం, థైరాయిడ్ సమస్యలు, నిద్రలేమి కూడా మతిమరుపునకు దోహదం చేస్తాయి. దీర్ఘకాలిక వ్యాధులను అదుపులో ఉంచుకోవడం, వ్యాయామం, ఒత్తిడి తగ్గించేందుకు యోగా, ధ్యానం, మంచి ఆహారపు అలవాట్లుతో నివారించవచ్చు.

– డాక్టర్ ఎం.నాగసురేష్, న్యూరాలజిస్టు, కర్నూలు

అయ్యో పాపం బసవన్న

ఆస్పరి: మండలంలోని డి.కోటకొండ గ్రామంలో పంచాయతీ అధికారులు డ్రైనేజీ కోసం తవ్విన గుంతలో ఆదివారం ఒక ఎద్దు జారిపడి కాలువలో ఇరుక్కుపోయింది. రైతు గోవిందారెడ్డి పొలం పనులను ముగించుకుని ఇంటికి వస్తుండగా ఎద్దు కాలు జారి కాలువలో పడిపోయింది. బెదరిపోయిన ఎద్దును అక్కడున్న గ్రామస్తులు కలిసి అతి కష్టం మీద బయటకు తీశారు. గ్రామంలో 20 రోజుల కిందట డ్రైనేజీ కోసం కాలువ తవ్వారని, పనులు త్వరితగతిన పూర్తిచేయాలని గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి లక్ష్మన్నను కోరారు.



క్లుప్తంగా

ప్రవేశ పరీక్షకు 13 మంది గైర్హాజరు


మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కోసిగి: స్థానిక మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 33 మంది దరఖాస్తు చేసుకోగా..13 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉత్తీర్ణత సాధించిన వారికి ఆరో తరగతిలో ప్రవేశం లభిస్తుందని చెప్పారు. బాలికలకు హాస్టల్ వసతి కూడా ఉందన్నారు.

శ్రీ మఠంలో కర్ణాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక హైకోర్టు జడ్జి ప్రభాకర్ శాస్త్రి ఆదివారం సాయంత్రం మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వీరికి అంతకు ఆలయ అధికారుల ఆలయ మర్యాదలతోస్వాగతం పలికారు.

మోస్తరు వర్షం

మంత్రాలయం రూరల్: మండలంలోని మంత్రాలయం, చెట్నేహళ్లి, మాధవరం తదితర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. వానతో పాటు గాలులు అధికంగా వీచాయి. కాగా.. రోజూ మేఘావృతమవుతున్నా పంటల సాగుకు అవసరమైన స్థాయిలో వర్షం కువరడం లేదని రైతులు పేర్కొంటున్నారు.

ముగిసిన వేసవి శిబిరం

మంత్రాలయం: మండల కేంద్రంలోని బహూకరణ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు వేడుకలను గ్రంథాలయ అధికారిణి వసంతలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గత 35 రోజులుగా విజ్ఞాన శిబిరంలో 25 మంది విద్యార్థి, విద్యార్థినులకు పుస్తకం పఠనం, వివిధ కార్యక్రమాల ద్వారా విజ్ఞానం పెంపొందించే కార్యక్రమాలు చేపట్టారు. ముగింపు వేడుకల్లో భాగంగా ఎంఈఓ అబ్దుల్‌కరీం విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

సూగూరులో ఘనంగా ఏరువాక పూజలు

మంత్రాలయం రూరల్: మండలంలోని సూగూరు గ్రామంలో ఆదివారం ఏరువాక పౌర్ణమి పండుగను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలో మారెమ్మ, సుంకులమ్మ, బీరప్ప తదితర గ్రామదేవతలకు పూజలు నిర్వహించారు. కుడుములు, భక్ష్యాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు.

నీటి సమస్య పరిష్కారం

కౌతాళం: స్థానిక పింజారీ వీధికి గత కొన్ని రోజులుగా తాగునీరు లేక కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న తీరును సర్పంచ్ పాల్‌దినకరన్ దృష్టికి తీసుకెళ్లగా కాలనీకి ప్రత్యేక పైపులైన్ వేయించి నీటిని సరఫరా చేసి సమస్యను పరిష్కరించారు. ఆదివారం సర్పంచ్ మాట్లాడుతూ పింజారీ వీధిలో నీటి సమస్య ఉన్నట్లు తెలియడంతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ప్రత్యేక పైప్ లైన్ వేయించాలని చెప్పడంతో ఆ మేరకు చర్యలు చేపట్టామని చెప్పారు.

ఉచిత సిటీ స్కాన్ కేంద్రం ఏర్పాటు చేయాలి

ఆదోని రూరల్: పట్టణంలోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత సిటీ స్కాన్ కేంద్రం ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు వీరేష్, డివిజన్ మాజీ కార్యదర్శి లక్ష్మన్న, వెంకటేశులు కోరారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ ఆదోని, పత్తికొండ రెండు డివిజన్ కేంద్రాల్లోని ఆస్పత్రిలో అన్ని రకాల జబ్బులకు మందులు లేకపోవడం, మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఆస్పత్రిలో సిటీ స్కాన్ లేకపోవడంతో పేదలు ప్రైవేట్ సిటీ స్కాన్ కేంద్రాలకు వెళ్ల లేకపోతున్నారని వారి కోసం ఉచిత కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు సతీష్, వీరేష్, మోహన్, ముని, వినోద్ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

కోసిగి: స్థానిక గ్రంథాయలంలో గత నెల రోజులుగా విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి దుల్లయ్య తెలిపారు. ఆదివారం శిక్షణ తరగతుల ముగింపు సమావేశం నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక పఠనం, క్రీడలు, వ్యాసరచన, వివిధ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కృష్ణగిరి: కోయిలకొండ గ్రామ శివారులోని బుగ్గానిపల్లె గోపాల్‌కు చెందిన పొలంలో పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో గ్రామానికి చెందిన బోయ పెద్దయ్య, కొడి అన్నెప్ప, దాసదొడ్డి శివయ్య, బోచ రమేష్, బోయిని కృష్ణ, పెద్ద రంగయ్యగారి లోకేలను అరెస్టు రూ.13,500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

శ్రీ మఠంలో చోరీ

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు గత నెల 12న న్యూఢిల్లీకి చెందిన సుజాతరావు,రాజురావు తన కుటుంబ సభ్యులతో కలిసి మంత్రాలయం వచ్చారు. అయితే దర్శనానికి వెళ్లే సమయంలో క్యూలైన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు తన హ్యాండ్ బ్యాగును దొంగిలించారని, అందులో దాదాపు రూ.2.50 లక్షలు విలువజేసే బంగారు ఆభరణాలు ఉన్నాయని, అయితే అత్యవసరం కావడంతో ఆ రోజు ఫిర్యాదు చేయకుండా వెళ్లిపోయామని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఆనంద్ రెడ్డి తెలిపారు.

పాము పట్టివేత


పామును చూపుతున్న గోపీ

ఆదోని అర్బన్ : పట్టణంలోని పాత ఓవర్ బ్రిడ్జి కింద కేకే ఫంక్షన్ హాల్ వెనక భాగంలో బొరుగుల బట్టిలో దూరిన పామును గోపీ అనే వ్యక్తి పట్టుకున్నాడు. శనివారం సాయంత్రం బొరుగుల బట్టిలో పాము రాకను చూసి బట్టి యజమాని చూసి భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే క్రాంతినగర్‌లో ఉన్న పాములు పట్టే వ్యక్తి గోపీకి సమచారమివ్వగా ఆయన వచ్చి ఒడుపుగా పట్టుకొని పట్టణ సమీపంలోని అడవుల్లో వదిలేశాడు.

దాడి కేసులో నిందితుల అరెస్ట్

మంత్రాలయం: మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో ఏరువాక పౌర్ణమి రోజు ఇరువర్గాల మధ్య జరిగిన గొడవలో ఓ వర్గంపై దాడి చేశారని ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన పోలీసులు ఆదివారం గాలెప్పతో పాటు మరో ఆరుగురిని అరెస్ట్ చేసి ఎమ్మిగనూరు కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారని మాధవరం ఎస్ఐ కిరణ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆదోని యువకుడు మృతి


మృతిచెందిన తాయిరాజ్

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఫారెస్ట్ లైన్ కాలనీకి చెందిన కస్తూరిబాయి కుమారుడు తాయిరాజ్ (27) అనంతపురం జిల్లా రాయదుర్గం తాలూకా హీరేహాల్ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. బంధువులు తెలిపిన మేరకు వివరాలు.. తాయిరాజ్ శనివారం అర్ధరాత్రి రాయదుర్గానికి బైకుపై వెళ్తుండగా అదుపు తప్పి కిందకు పడి గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు. కాగా తాయిరాజ్ రాయదుర్గం వైపు ఎందుకు వెళ్లాడనే వివరాలు తెలియాల్సి ఉంది. పోస్టుమార్టం నిమిత్తం బళ్లారి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్: ఆదోని–రాయచూరు రహదారిలోని బాట మారెమ్మవ్వ ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డారని ఇస్పీ ఇన్‌చార్జ్ ఎస్ఐ పీరయ్య తెలిపారు. ఆస్పరి మండలం ములుగుందం గ్రామానికి చెందిన విజయ్, సాయిపోగు చంటి తమ మోటార్ సైకిల్‌పై 93 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను తీసుకొస్తుండగా వారిని అదుపులోకి తీసుకొని, 93 టెట్రా ప్యాకెట్లు, మోటార్ సైకిల్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. హెడ్‌కానిస్టేబుల్ రామయ్య, పోలీస్ కానిస్టేబుళ్లు అశోక్, షరీఫ్, నీలకంఠ పాల్గొన్నారు.

ఉరుకుందలో అగ్ని ప్రమాదం

కౌతాళం: ఉరుకుంద గ్రామంలో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించి రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం జరిగింది. దేవాలయం వద్ద వివిధ తినుబండరాలను తయారు చేసుకుని వ్యాపారం చేస్తూ జీవిస్తున్న కర్ణాటక వాసులు హరీష్, బస్సమ్మ దంపతులకు చెందిన షెడ్డులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో తినుబండరాల కోసం తెచ్చిన సరుకులతో పాటు ఇంట్లోనున్న సామగ్రి కూడా అగ్నికి ఆహుతి అయ్యింది. అలాగే రూ.50 నగదు కూడా కాలిపోయిందని వారు వాపోయారు.

భక్తిశ్రద్ధలతో అనఘాష్టమి వ్రతాలు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయం ఆవరణలోని దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అనఘాష్టమిని పురస్కరించుకుని అనఘా దేవి సమేత అనఘా స్వామికి అనఘాష్టమి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.